

రంజాన్ వేళలు



	ఇఫ్తార్(మంగళవారం)	సెహరీ(బుధవారం)
కర్నూలు	6:34 (సాయంత్రం)	5:00 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:13 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	5:02 (ఉదయం)







గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చున్న పదో తరగతి విద్యార్థులు

అసౌకర్యాల నడుమ..

- ప్రారంభమైన 'పది' పరీక్షలు
- ఒక్కో బెంచ్‌కు ఇద్దరేసి విద్యార్థులు
- తిరగని ఫ్యాన్లు.. ఉక్కపోతతో అవస్థలు
- పలు చోట్ల నేలపై కూర్చున్న వైనం
- మొదటి రోజు 810 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18: అసౌకర్యాల నడుమ జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని చెప్పినప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా కనిపించాయి. పరీక్ష హాలులో ఒక బెంచ్‌పై ఇద్దరు విద్యార్థులను కూర్చోబెట్టి పరీక్షలు రాయించారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బెంచీలు కూడా చిన్నవిగా ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. మరికొన్నిచోట్ల బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చొని అవస్థలు పడుతూ పరీక్షలు రాశారు. మరికొన్ని పాఠశాలల్లో ఫ్యాన్లు ఉన్నప్పటికీ అవి పనిచేయలేదు. దీంతో పరీక్ష టెన్షన్‌కు తోడు ఎండవేడిమి, ఉక్కపోతతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సు సర్వీసులను రెగ్యులర్ రోడ్డు మార్గాల్లోనే నడిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు సొంత గ్రామాల నుంచి తల్లిదండ్రులతో ద్విచక్రవాహనాలు, ఆటోలలో సామర్థ్యానికి మించి పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వ్యయప్రయాసలకు గురయ్యారు. గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో 5,9 గదులలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు టెబుల్స్ లేక పోవడంతో నేలపై కూర్చొని పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయి. కర్నూలు జిల్లాలో 489 ఉన్నత పాఠశాలల నుంచి 37,801 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 31,178 మంది కాగా, ప్రైవేటుగా 6,623 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు కొనసాగాయి. మొదటి రోజు జరిగిన పరీక్షకు 33,144 మంది నమోదు చేసుకోగా, 32,334 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 810 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు కావడంతో ఉదయం 8 గంటలకే విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులతో కలిసి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 8:45 గంటలకు పరీక్ష నిర్వాహకులు విద్యార్థులను గేటు బయటనే తనిఖీలు చేసి పరీక్ష గదుల్లోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు ఆఫీసర్లుతో పాటు ఇన్విజిలేటర్లు సైతం ఎవరికి సెల్‌ఫోన్లను అనుమతించలేదు. వారిని కూడా చెక్ చేసి పోలీసులు లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాల్లో వైద్యసిబ్బందిని ఏర్పాటు చేశారు. జిల్లా పరిశీలనాధికారి గీత 8 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ 2, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 7, సిట్టింగ్ స్క్వాడ్స్ 44 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. సమీపంలో ఫొటోస్టాట్ సెంటర్లను కూడా మూసివేయించారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.





అమ్మతో కలసి...



పరీక్ష హాల్‌లోకి వెళ్లేందుకు వెయిటింగ్..



అదిగో... అటు వెళ్లు..



పరీక్ష పూర్తయ్యాక గేటు బయట తల్లిదండ్రులు



ఒంటరిగా 21 గంటలు

- రాత్రంతా గదిలోనే బాలుడు
- చూసుకోకుండా తలుపులు వేసిన సిబ్బంది
- ఆకలితో అలమటించి నీటితోనే కడుపు నింపుకున్న వైనం
- పెద్దాసుపత్రిలో ఘటన



తండ్రితో బాలుడు సుదీత్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 18: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి బూత్ బంగ్లాలోని ఆపరేషన్ థియేటర్ అనస్థీషియా హెచ్‌వోడీ గదిలో ఐదేళ్ల బాలుడు 21 గంటలు ఒంటరిగా ఉండిపోయాడు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తినడానికి తిండి లేక ఆదివారం రాత్రంతా నరకయాతన అనుభవించాడు. సోమవారం ఉదయం సిబ్బంది వచ్చి ఆపరేషన్ థియేటర్ గది తలుపు తీయడంతో ఆ బాలుడు కనిపించాడు. సిబ్బంది ఒంటరిగా ఉన్న ఆ బాలుడిని చూసి నివ్వెరపోయారు. ఓర్వకల్లు మండలం తిప్పాయపల్లెకు చెందిన ఐదేళ్ల బాలుడు సుదిత్ మూగ, చెవుడు సమస్యతో బాధపడుతున్నాడు. కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం తల్లిదండ్రులు 20 రోజుల క్రితం ఈఎన్‌టీ విభాగంలో చేర్పించారు. మంగళవారం సర్జరీ చేయాలని ఈఎన్‌టీ వైద్యులు నిర్ణయించారు. అయితే ఆదివారం ఆపరేషన్ థియేటర్‌ను శుభ్రం చేయడానికి సిబ్బంది తలుపులు తెరిచారు. ఈ ఆపరేషన్ థియేటర్‌లోనే అనస్థీషియా విభాగపు హెచ్‌వోడీ గది ఉంది. బాలుడు ఆడుకుంటూ అనస్థీషియా హెచ్‌వోడీ గదిలోకి వెళ్లాడు. సిబ్బంది చూసుకోకుండా ఆపరేషన్ థియేటర్, హెచ్‌వోడీ గది తలుపులకు తాళం వేసి వెళ్లిపోయారు. రాత్రంతా బిక్కుబిక్కున కాలం గడిపాడు. ఆకలి వేసినప్పుడల్లా ఫ్రిజ్ నీరు తాగుతూ ఉండిపోయాడు. సోమవారం ఉదయం సిబ్బంది వచ్చి ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరవడంతో బాలుడు కనిపించాడు. అయితే అప్పటికే బాలుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డిని వివరణ కోరగా బాలుని ఆచూకీ దొరికిందని తెలిపారు.

హంద్రీ నీవా కాలువకు నిలిచిన శ్రీశైలం నీరు



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 18: శ్రీశైలం జలాశయం నీర్చు డెడ్ స్టోరేజీకి తగ్గిపోవడంతో హంద్రీనీవా కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. సోమవారం వరకు హంద్రీ నీవా కాలువకు శ్రీశైలం జలాశయం నుం చి మల్యాల, ముచ్చుమర్రి లిఫ్టు స్కీంల ద్వారా 22.8468 టీఎంసీల నిలిపేశామని ఈఈ సదాశివరెడ్డి తెలిపారు. ఇందులో హంద్రీ నీవా కాలువకు 21.3677 టీఎంసీలు, ముచ్చుమర్రి లిఫ్టు స్కీం నుంచి కేసీ కెనాల్‌కు 1.4791 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు హంద్రీనీవా కాలువ ద్వారా సాగు చేస్తున్న పంటలకు నీటిని అందించగలిగామని, దాదాపు 77 చెరువులకు నీరు అందించడం ద్వారా సాగు, తాగు నీటికి ఇబ్బందులు చాలా వరకు తొలగిపోయాయని ఈఈ సదాశివరెడ్డి తెలిపారు.

మూల్యాంకనంలో కచ్చితత్వం ఉండాలి

- ఇంటర్ స్పాట్ విధులకు గైర్హాజరైతే జరిమానా
- ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి



మాట్లాడుతున్న ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18: ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగరాదని, కచ్చితత్వం ఉండాలని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఎగ్జామినర్లకు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఎగ్జామినర్లకు ఇంటర్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంపై వర్క్‌షాపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ ఆర్డర్స్ వచ్చిన వారందరూ విధులకు తప్పక హాజరు కావాలని తెలిపారు. విధులకు గైర్హాజరైతే క్షమించే ప్రసక్తే లేదని, రోజుకు రూ.1000 జరిమానా విధిస్తామన్నారు. అంతేగాకుండా ప్రభుత్వ అధ్యాపకులైతే జరిమానాతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు శాఖపరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రైవేటు కళాశాలలో పని చేసే అధ్యాపకులైతే.. ఆ కళాశాలల యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో ఎగ్జామినర్లు ఎక్కువ, తక్కువ మార్కులు వేయడానికి వీల్లేదని, కచ్చితత్వం పాటించాలని అన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన జవాబుపత్రాల మూల్యాంకన శిబిరానికి మొత్తం 420 మంది ఎగ్జామినర్లు హాజరు కావాల్సి ఉండగా.. అందులో 294 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఈ నెల 18 నుంచి ఇంగ్లీషు, గణితం, సివిక్స్, తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్, పర్షియన్, కన్నడ సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విధులకు ఆలస్యంగా రావడం కానీ, ముందుగా వెళ్లడం కానీ జరగరాదన్నారు. ఈ సమావేశంలో డీవీఈవో జమీర్‌పాషా, ప్రిన్సిపాల్స్ పరమేశ్వరరెడ్డి, సుంకన్న, ఎగ్జామినర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమిదే అధికారం : బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), మార్చి 18: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జేఎస్పీ కూటమిదే అధికారమని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 4 సంవత్సరాల 11 నెలల్లో సాగించిన కూల్చివేతలు, అవినీతి, అక్రమ, అప్రజాస్వామిక, ఆరాచక, హత్యా రాజకీయాలతో అన్ని వర్గాల ప్రజలు విసిగి వేసారి పోయారని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. ఎప్పుడు జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడుదామా..? అని వేయికళ్లతో ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. వారు ఎదురు చూస్తున్న ఘడి యలు రానే వచ్చాయని మే 13న ఓటు ద్వారా అంతిమ తీర్పు ఇచ్చేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నారని తెలిపారు. చిలకలూరి పేట బోపూడిలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు తరలి వచ్చి ఘనంగా విజయవంతం చేశారన్నారు. ప్రజాగళం ఎన్‌డీఏ కూటమి సభకు లక్షలాది ప్రజలు తరలి రావటాన్ని బట్టే ప్రస్తుతం జగన్ ప్రభుత్వం, వారి పాలన అంపశయ్యపై ఉన్నదని రుజువైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్, వైసీపీ ఒకే ఒరలోని రెండు కత్తులుగా ఆడుతున్న నాటకం ప్రజలను మభ్యపెట్టేందుకే అని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సమూలంగా దోచేస్తున్న మోసాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి పోయిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం 72 శాతం పనులు పూర్తి చేసిన పోలవ రం ప్రాజెక్టు మిగిలిపోయిన పనులు కూడా పూర్తి చేయలేని, చేతగాని జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అధ్వానంగా మారాయని గుర్తు చేశారు. కలెక్టరేట్ కార్యాలయాలు, రైతుబజారు భవనాలు, ప్రభుత్వ కళాశాలలతో సహా అన్ని ప్రభుత్వ అస్తులను జగన్ ప్రభుత్వం తనఖా పెట్టే నీచమైన స్థితికి దిగజారిందన్నారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్

అధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ



పట్టణంలోని 29వ వార్డులో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వార్డు వలంటీర్ నరసింహులు



గోనేగండ్ల మండలం పెద్దనేలటూరులో వైసీపీ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న హెచ్.కైరవాడి శాఖ కేడీసీసీ బ్యాంకు అటెండర్

ఎమ్మిగనూరు, మార్చి 18: ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరిస్తూ ఎమ్మిగనూరు పట్టణంలో ఓ వార్డు వలంటీర్ అధికార పార్టీ ప్రచారంలో పాల్గొన్నాడు. దీంతో టీడీపీ నాయకులు సదరు వలంటీర్‌పై స్థానిక ఎన్నికల అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 29వ వార్డులో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో స్థానిక వార్డు వలంటీర్ నరసింహులు పాల్గొన్నాడు. స్థానిక ప్రజలను కలిసి సంక్షేమ పథకాలను వివరించాడు. అలాగే గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి కేడీసీసీ బ్యాంకులో అటెండర్‌గా పని చేస్తున్న హనుమంతు పెద్దనేలటూరు గ్రామంలో వైసీపీ నాయకులు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించిన వీరిపై చర్యలు తీసుకోవాలని సోమవారం స్థానిక ఎన్నికల అధికారి చిరంజీవికి ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకులు వడ్డె కృష్ణ, పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల స్వీకరణ



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 18: ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఇతర ఫిర్యాదులను వివిధ మాధ్యమాల ద్వారా స్వీకరిస్తామని కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఇతర ఫిర్యాదులను సీ-విజిల్ యాప్‌లో కానీ, హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబరు - 1950కు కానీ, కర్నూలు జిల్లా టోల్‌ఫ్రీ నెంబర్.1800 425 7755కు కానీ, కాల్ సెంటర్.08518-220125ను కానీ, ఎంసీసీ మెయిల్ ఐడీలు mcczppkurnool@gmail.com, cmcknl2024@gmail.comలకు కానీ ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసే వారు డీఐపీఆర్వో, కర్నూలు ట్విట్టర్ అకౌంటుకు ఫిర్యాదును ట్యాగ్‌ను చేయవచ్చని తెలిపారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలిస్తామన్నారు. తద్వారా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయండి

పోలింగ్ కేంద్రాలను 15 రోజుల్లోపు వంద శాతం తనిఖీ చేయాలని కలెక్టర్ డా.జి.సృజన ఎన్నికల రిటర్నింగ్ అధికారులను టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. సోమవారం ఎన్నికల అంశాలపై ఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున పోస్టర్లు, కరపత్రాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగించి నివేదికలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పత్రికల్లో ఆర్టికల్స్ రూపంలో వచ్చే పెయిడ్ న్యూస్‌ను ఎంసీఎంసీ కమిటీ గుర్తించాలని, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత సంబంధిత పార్టీల అభ్యర్థులకు నోటీసులు ఇచ్చి వారి వివరణను తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. రాజకీయ నాయకులు ప్రభుత్వ అతిథి గృహాలలో ఉండకుండా చూసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈకాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు శేషరెడ్డి, రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ప్రభుత్వ ఉద్యోగులను హెచ్చరించిన కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 18: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని కలెక్టర్ డా.జి.సృజన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వారిని విధుల నుంచి తొలగిస్తామని అన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వెంటనే సస్పెండ్ చేస్తామని తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు ఏవైనా ఉంటే కర్నూలు జిల్లా టోల్‌ఫ్రీ నెంబర్.1800 425 7755 ను కానీ, కాల్ సెంటర్ 08518-220125 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

రిటర్నింగ్ ఆఫీసర్లు వీరే..

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 18: కర్నూలు పార్లమెంటు పరిధిలోని రిటర్నింగ్ ఆఫీసర్లను పేర్లను అధికారులు ప్రకటించారు. జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ సృజన ఉంటారు.

నియోజకవర్గం	అధికారి	ఫోన్ నెంబరు
కర్నూలు జిల్లా	డా.జి.సృజన, ఐఏఎస్, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి	9440290999
137 కర్నూలు అసెంబ్లీ	భార్గవ్‌తేజ, ఐఏఎస్, మున్సిపల్ కమిషనర్, కర్నూలు	8106228899
138 పాణ్యం అసెంబ్లీ	నారపురెడ్డి మౌర్య, ఐఏఎస్ జాయింట్ కలెక్టర్, కర్నూలు	8978840011
142 పత్తికొండ అసెంబ్లీ	ఎన్.రామలక్ష్మి, ఆర్డీవో, పత్తికొండ,	8333989005
143 కోడుమూరు	ఎం.శేషిరెడ్డి, ఆర్డీవో, కర్నూలు	9849904163
144 ఎమ్మిగనూరు	టి.చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్‌హెచ్	9849587489
145 మంత్రాలయం	ఎ.మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	8121965442
146 ఆదోని అసెంబ్లీ	శివనారాయణ శర్మ, ఐఏఎస్ సబ్ కలెక్టర్, ఆదోని	9849904164
147 ఆలూరు అసెంబ్లీ	డి.రాముా నాయక్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	9849228338


మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్ పోస్టు

కోడ్‌తో కాస్త జాగ్రత్త

- నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు
- రూ.50 వేలకు మించితే ఆధారాలు చూపాల్సిందే
- రూ.10 లక్షలపైన ఉంటే ఆదాయ పన్ను శాఖకు అప్పగింత
- జిల్లాలో అంతర్ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. నగదు, మద్యం అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వచ్చే ప్రధాన రహదారుల సరిహద్దుల్లో అంతర్ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీలు ప్రారంభించారు. నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు విధించారు. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సంబంధించిన ఆధారాలు చూపించాలి. సరైన పత్రాలు చూపించకపోతే సీజ్ చేస్తారు. కలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు అధికారులతో స్ర్కీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుకున్న డబ్బు, ఇతర వస్తువులను ఈ కమిటీ పరిశీలించి చర్యలు తీసుకుంటుంది. ఎన్నికలు ముగిసే వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు.


పంచలింగాల చెక్ పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పార్లమెంటు సహా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ క్షణం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. సరిహద్దులో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాలో నగదు, మద్యం సహా ఇతర ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ఎలాంటి వస్తువులను అక్రమంగా రవాణా చేయకుండా అంతర్ జిల్లా, అంతర్‌రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీల సమయంలో ఒక వ్యక్తి వద్ద రూ.50 వేలకు మించి నగదు లభిస్తే ఆ డబ్బులకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే డబ్బును సీజ్ చేస్తారు. ముఖ్యంగా నగదు, బంగారం ఇతర వస్తువులు తరలింపుపైనా ఆంక్షలు పక్కాగా అమలు చేస్తారు. సామాన్య ప్రజలు నగదు, బంగారం, వెండి వంటిని తీసుకెళ్తూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే సరైన పత్రాలు చూపించాలి. లేదంటే వాటిని సీజ్ చేస్తారు. పోలీసులు పట్టుకున్న డబ్బులపై ఎలాంటి ఆక్షేపణలు లేకపోతే వారం రోజుల్లోగా ఆధారాలు చూపిస్తే వాటిని తిరిగి ఇస్తారు. సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండాకలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు అధికారులతో స్ర్కీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. పట్టుకున్న డబ్బులు, ఇతర వస్తువులను ఈ కమిటీ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటుంది. రాజకీయ నాయకుల వద్ద నగదు, ఇతర వస్తువులు పట్టుకున్నా వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తారు.

నగదుతో ప్రయాణం.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కోడ్ అమలులో ఉన్న ఈ సమయంలో సామాన్య ప్రజలు నగదుతో ప్రయాణించే సమయంలో ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. విద్యా సంస్థల్లో ఫీజు, ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించడం, శుభకార్యాలు, వ్యాపారులు, ఇతరత్రా అవసరాలకు అధిక మొత్తంగా నగదు తీసుకువెళ్తున్నట్లైతే తగిన ఆధారాలు వెంట తీసుకెళ్లాలి. బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేస్తే.. సంబంధిత బ్యాంక్ అకౌంట్ బుక్, ఏటీఎం రశీదులు వెంట తీసుకువెళ్లడం ఉత్తమం.
- ఆసుపత్రులకు డబ్బులతో వెళ్తున్న వారు పేషెంట్ రిపోర్టులు, ఇతర డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలి.
- వ్యాపారులు, రైతులు వస్తువులు, ధాన్యం, భూముల విక్రయానికి సంబంధించిన డబ్బు అయితే వాటికి సంబంధించిన బిల్లులు, ల్యాండ్ డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. బంగారం, ఆభరణాలు కొనుగోలు సమయంలో తీసుకున్న రశీదులు వెంట ఉంచుకోవాలి.
- వ్యాపారం, ఇతర సేవల కోసం డబ్బు వినియోగిస్తే తనిఖీల సమయంలో లావాదేవీల వివరాలను ఆధారాలతో అధికారులకు చూపించాలి. వ్యక్తుల శరీరంపై ధరించిన ఆభరణాలకు ఎలాంటి ఆంక్షలు ఉండవు.
- రూ.10 లక్షలకుపైగా నగదు లభ్యమైతే ఐటీ, జీఎస్టీ అధికారులు రంగంలోకి దిగుతారు. వాటికి సంబంధించిన కచ్చితమైన ఆధారాలు చూపిస్తేనే తిరిగి ఆ డబ్బులు ఇస్తారు. తనిఖీల్లోల పట్టుబడిన నగదు, బంగారం, వెండి ఇతర వస్తువులన్నింటినీ జిల్లా ట్రెజరీలో భద్రపరుస్తారు. స్ర్కీమింగ్ కమిటీ, ఆదాయ పన్ను శాఖ అధికారులు రిలీజింగ్ ఆర్డర్ ఇస్తేనే తిరిగి అప్పగిస్తారు.





ఆదోని మండలం పెద్దహరివాణం చెక్ పోస్టు వద్ద తనిఖీలు

ఎన్నికల వేళ అభ్యర్థులు, ఓటర్లకు కీలక సూచనలు

- రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధిక మొత్తంలో నగదు చెలామణి విషయంలో ఎన్నికల అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సర్వలైన్ టీం సిబ్బంది అనుక్షణం తనిఖీలు చేస్తుంటారు. స్థానికులు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే తమతో తీసుకు వెళ్తున్న నగదు, బంగారం, వెండి.. వంటి విలువైన వస్తువులకు సంబంధించి తగిన ఆధారాలు, ధృవపత్రాలను వెంట ఉంచుకోవడం మంచిది. నగదు, బంగారం, వెండి భారీ స్థాయిలో తీసుకెళ్లినా ఇబ్బందికరమని అధికారులు చెబుతున్నారు.
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. సమావేశం ఎప్పుడు ఎక్కడ నిర్వహిస్తున్నారో ఆ వివరాలు ముందుగా తెలియజేస్తే పోలీసులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తారు. సమావేశంలో లౌడ్ స్పీకర్లు వినియోగించాలనుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించాలనుకుంటే ముందుగానే పోలీసులకు చెప్పాలి. ర్యాలీ ఎక్కడ మొదలవుతుంది.. ఏ మార్గంలో వెళ్తుంది.. ఎన్నింటికి మొదలవుతుంది. ఎన్ని గంటలకు ఎక్కడ ముగుస్తుంది వంటి వివరాలు స్పష్టంగా తెలియజేయాలి. ర్యాలీ నిర్వహించే సమయంలో మార్గం మార్చడం వంటివి చేయరాదు. ర్యాలీ సాగే మార్గంలో అప్పటికీ ఏవైనా నిషేధాజ్ఞలు ఉంటే నిర్వాహకులు పాటించాల్సి ఉంటుంది.
- ఒకే ప్రాంతంలో, ఒకే సమయంలో వేర్వేరు పార్టీలు లేదా వేర్వేరు అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించాలనుకుంటే రెండు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు తగిన సర్దుబాటు కోసం అవసరమైతే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలి. ర్యాలీలు, సభలు, సమావేశాలు వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టి బొమ్మలను తీసుకెళ్లడం, తగలబెట్టడం నిషేధం.

ఎనిమిది అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు


హొళగుంద మండలం మార్లమడికి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

జిల్లాను ఆనుకుని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. నగదు, మద్యం, బంగారం అక్రమ రవాణాను అరికట్టేందుకు 8 చోట్ల అంతర్ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. హైదరాబాదు-బెంగళూరు జాతీయ రహదారిపై కర్నూలు రూరల్ మండలం పంచలింగాల వద్ద, సుంకేసుల బ్యారేజీ దగ్గర, నందవరం మండలం నాగులదిన్నె బ్రిడ్జి వద్ద, ఆంధ్ర-కర్ణాటక కలిపే మంత్రాలయం మాధవరం బ్రిడ్జి వద్ద, కౌతాళం మండలం బాపురం, ఆదోని మండలం పెద్ద హరివాణం దగ్గర, హొళగుంద మండలం మార్లమడికి గ్రామం దగ్గర, హాలహర్వి మండలం ఛత్రగుడి దగ్గర.. ఇలా 8 చోట్ల అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ, సెబ్ తదితర శాఖల అధికారుల బృందాలు 24 గంటల పాటు విధుల్లో ఉంటూ వాహనాలను తనిఖీ చేస్తారు. ప్రతి నియోజకవర్గంలో సర్వలైన్ టీంలు, మండలానికి ఒక వీడియో సర్వలైన్ టీమ్ ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిత్యం పెట్రోలింగ్ చేస్తూ ఎక్కడి నుంచి సమాచారం అందినా తక్షణం సంఘటనకు చేరుకొని విచారణ జరిపి చర్యలు తీసుకుంటాయి. అయితే.. ఈ చెక్ పోస్టు వద్ద సీఐ, ఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో నిత్యం తనిఖీతలు నిర్వహించాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

దుఃఖంతోనే పరీక్షకు హాజరైన మనుమరాలు

కోడుమూరు (రూరల్), మార్చి 18: మండలంలోని కొత్తూరు వద్ద సోమవారం ఉదయం కారు ఢీకొన్న ఘటనలో ములకల మిద్దె రామయ్య(65) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. రామయ్య ఉదయం కల్లందొడ్డిలో పశువులకు నీళ్ల తీసుకరావడానికి రోడ్డుకు ఇవతలి వైపున మినీ ట్యాంకు వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి నీటి బిందెను భుజంపై ఎత్తుకుని రోడ్డు దాటుతుండగా కర్నూలు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రామయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు కారును అడ్డగించి పోలీసులకు సమాచారం అందించారు. కారులో ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిసింది. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్ చేర్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య అనంతమ్మ, కొడుకు ఉన్నారు.


రామయ్య (ఫైల్)

- **అటు తాత మరణం..ఇటు పరీక్ష:** పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న రామయ్య మనవరాలు తేజశ్విని గంగమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆలయం బయటికి వచ్చింది. సమీపంలో బస్ షెల్టర్ వద్ద రోడ్డుపై జనం గుమికూడిన దృశ్యం ఆమె కంటబడింది. ఆదుర్దాగా అక్కడికి వెళ్లి చూడగా తీవ్రగాయాలతో తాత కనిపించాడు. అక్కడికి కుటుంబ సభ్యులంతా చేరుకున్నారు. అంత దుఃఖంలో కూడా తేజశ్వని తోటి విద్యార్థులతో పరీక్షకు వెళ్లింది.


పది పరీక్షకు హాజరైన తేజశ్విని

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గోనెగండ్ల, మార్చి 18: చిన్నమరివీడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కురువ అయ్యస్వామి(42) విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామంలో మారెమ్మ దేవర సందర్భంగా అయ్యస్వామి బావమరిది వీరేష్ గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చెరుకు రసం అమ్మే దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి వ్యాపారం ఎట్లా ఉందని అడిగేందుకు వీరేష్ దగ్గరికి వెళ్లాడు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుత్ వైర్ తెగిపడి ఉన్నదాన్ని గమనించని అయ్యస్వామి దాన్ని తగలడంతో కరెంట్ షాక్ కొట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గ్రామస్థులు వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు సోమవారం తెల్లవారుజామున అయ్యస్వామి మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశాలకు

దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 18: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ల్లో 2024-25 ప్రవేశాలకు రాయలసీమ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్‌జేసీ కర్నూలు జిల్లా సమన్వయ కర్త డాక్టర్ శ్రీనివాసగుప్త తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మార్చి 31వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం(ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు) రాయలసీమ జిల్లాకు చెందిన బాలికలు మాత్రమే బనవాసి ఏపీఆర్‌జేసీ కళాశాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. అలాగే రాయలసీమ బాలురు గ్యారంపల్లి, కొడిగెనహళ్లి, నాగార్జున సాగర్ ఏపీఆర్‌జేసీ కళాశాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకేషనల్ విద్యార్థులు నిమ్మకూర్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఏపీఆర్‌డీసీ నాగార్జునసాగర్‌కు బీఏ మొదటి సంవత్సరం, బీకం, బీఎస్సీ గ్రూప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్ష 25.04.2024 మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు ఉంటుందని అన్నారు. అలాగే 5,6,7,8 వ తరగతులకు ఏపీఆర్ఎస్ క్యాట్ ఏప్రిల్ 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

బుగ్గన అసెంబ్లీలో అడుగు పెట్టలేరు

- ఇఫ్తార్ విందుకు పిలిచి వైసీపీ కండువాలు వేయడమా...?
- ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన మంత్రి
- కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 18: మంత్రి బుగ్గన ఇప్పటి వరకు ప్రజలను మభ్యపెడుతూ గెలిచారని, రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీలో అడుగు పెట్టలేరని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రాత్రికి రాత్రే డోన్ ఈద్గా మసీదు కమిటీని నియమిస్తూ ఎలా జీవో జారీ చేయిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత మతపెద్దలు మాట్లాడుకుని కమిటీలు నియమించుకోవాలే తప్ప.. ఇలా రాజకీయం చేయడం మంత్రి బుగ్గనకు తగదన్నారు. ముస్లిం మైనార్టీల ఇఫ్తార్‌విందులో మంత్రి బుగ్గన రాజకీయం చేస్తూ ముస్లింలకు వైసీపీ కండువాలు కప్పడం చాలా దారుణమన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును అపవిత్రపరిచి ముస్లిం మైనార్టీల మనోభావాలను మంత్రి బుగ్గన దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుగ్గన ఫ్లెక్సీలు డోన్‌లో ఇంకా కనిపిస్తున్నాయని, అధికారులు వైసీపీ బోర్డులను తొలగించాలని, లేకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మంత్రి బుగ్గన తానొక్కడే అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆయన మాటలు ఇక డోన్ నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌భాషా, ఎస్ఎండీ రఫీ, అన్వర్, నూర్, మర్రి రమణ, భాస్కర్ నాయుడు, గోపాల్ రెడ్డి, ఓంప్రకాష్, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, హేమసుందర్ రెడ్డి, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 18: వివిధ మాధ్యమాల ద్వారా ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. సోమవారం సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్, జిల్లా స్థాయి కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. కమ్యూనికేషన్ సెంటరులో సంబంధిత అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసీఎంసీ సెల్‌లో ఎలక్ర్టానిక్, ప్రింట్, సోషల్ మీడియాల్లో వచ్చే పెయిడ్ న్యూస్ పరిశీలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వీటిపై రిజిస్టర్లు నిర్వహించాలని, రోజువారి నివేదికలను తయారు చేయాలని సూచించారు. ఎలక్ర్టానిక్ మీడియా, సోషల్ మీడియాల్లో రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. జిల్లా కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌లో ఓటరు హెల్ప్‌లైన్ నెంబర్.1950, టోల్‌ఫ్రీ నెంబర్, ల్యాండ్‌లైన్ నెంబర్, వాట్సాప్ నెంబర్, టీవీ స్ర్కోలింగ్, సోషల్ మీడియాల ద్వారా ఫిర్యాదులు రాగానే సంబంధిత ఫార్మాట్లలలో రూపొందించి మెయిల్ ద్వారా సెక్టార్ అధికారులు, సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులకు పంపించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూం.24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఫిర్యాదులను 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు ఎంసీఎంసీ ఫిర్యాదులు సెల్‌కి సంబందించిన నివేదికలు పంపాలని సీపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు పార్లమెంటు నోడల్ అధికారిగా జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 18: భారత ఎన్నికల కమిషన్ రెండు రోజుల క్రితం కర్నూలు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మిని కర్నూలు పార్లమెంటు స్థానిక సింగిల్ విండో పర్మిషన్ సెల్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌కు నోడల్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ డా.జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంటు స్థానానికి పోటీ చేయబోయే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చేపట్టబోయే కార్యక్రమాలు ముందుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, లౌడ్ స్పీకర్లు తదితర వాటికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. రాజకీయ పార్టీల అభ్యర్థులు సింగిల్ విండో పర్మిషన్ సెల్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌కు తాము చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి. అభ్యర్థులు రాజకీయ పార్టీల నాయకులు సమర్పించే దరఖాస్తులను నోడల్ అధికారి వరలక్ష్మి పరిశీలించి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి పంపిస్తారు. కలెక్టర్ ఆమోదిస్తేనే ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలి.



పెద్దాసుపత్రిలో డీఎంఈ అధికారుల విచారణ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 18: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో స్టేషనరీ అక్రమాలపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అకౌంట్ ఆఫీసర్లు భాస్కర్‌రావు, భూపాల్ సోమవారం విచారణ చేపట్టారు. ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, సిబ్బంది, ఫార్మసీ అధికారులు, కార్యాలయ అధికారులను వారు విచారణ చేశారు. ఆసుపత్రిలో స్టేషనరీ కొనుగోలులో అవకతవకలు జరిగాయని గతంలో ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఏడీ రమేష్‌బాబును సరెండర్ చేశారు. దీనిపై విచారణకు ఆదేశించారు. గతంలో పని చేసిన ఫార్మసీ సూపర్‌వైజర్‌తో పాటు అప్పటి ఏడీలను కూడా అధికారులు విచారణ చేశారు.

క్రిష్ణగిరిలో గ్రానైట్ క్వారీ పరిశీలన

కర్నూలు(అర్బన్), మార్చి 18: క్రిష్ణగిరిలో కొత్తగా గ్రానైట్ తవ్వకాల కోసం మరో ప్రాంతాన్ని పరిశీలించామని గనుల శాఖ డీడీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. క్రిష్ణగిరి మండల పరిధిలో కొత్తగా గ్రానైట్ నిల్వలు ఉన్నట్లు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. అందులో భాగంగానే తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ తనీఖీల్లో సూపర్‌వైజర్ గోవిందరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాగళం ఘన విజయం

- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారం
- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 18: ప్రజాగళం సభ విజయవంతమైందని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రం సర్వనాశనమైందని, వైసీపీ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలు వేరు కాదని, ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందిన వేనన్నారు. ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, జగన్ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దింపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు 75 శాతం పూర్తి చేసిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అడ్డుకుందన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులన్నీ అధ్వానంగా మారాయ న్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికా రంలోకి రాబోతుందన్నారు. పోలవరాన్ని అమరావతి రాజధానిని, ప్రాజె క్టులను అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్‌మహబూబ్‌బాషా, లాయర్ చక్రపాణి, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ రాష్ట్ర సహ సేవా ప్రముఖ్‌గా గురుమూర్తి

కర్నూలు(కల్చరల్), మార్చి 18: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర సహ సేవాప్రముఖ్‌గా కర్నూలుకు చెందిన పీపీ గురుమూర్తి నియమితులయ్యారు. తిరుపతిలో గత మూడురోజులుగా జరిగిన వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో చివరిరోజు సోమవారం ఈ నియామకం చేసినట్లు వీహెచ్‌పీ అధ్యక్ష, కార్యదర్శులు నందిరెడ్డి సాయిరెడ్డి, కాకర్ల రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. పీపీ గురుమూర్తి ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ అనంతరం నగర శివారులోని విజ్ఞానపీఠం అరక్షిత శిశుమందిరానికి కరస్పాం డెంట్‌గా కొనసాగుతున్నారు. పీపీ గురుమూర్తి మాట్లాడుతూ వీహెచ్‌పీ చేపట్టే కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

ఘనంగా నీలకంఠేశ్వరుడి పూజలు

గూడూరు, మార్చి 18: గూడూరులో వెలసిన భువనేశ్వరి నీలకంఠేశ్వరుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని నీలకంఠేశ్వరుడి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఆలయ పూజారి నాగరాజు అభిషేకం తదిరత పూజలు చేశారు. భక్తులు, మహిళలు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీరుకున్నారు.

దళితులకు రక్షణ కరువు



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కర్నూలు(న్యూసిటీ), మార్చి 18: బీజేపీ ప్రభుత్వంలో దళితులు, మైనార్టీలకు రక్షణ కరువైందని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జీ.ఈశ్వరయ్య అన్నారు. సోమవారం సీఆర్ భవన్‌లో వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా నినాదంతో ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలకుల విధానాలు యువత కర్తవ్యం అనే అంశంపై జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఈశ్వరయ్య మాట్లాడారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్.రసూల్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాముడు, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, సభ్యులు బీసన్న, పెద్దయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ పేరుతో దగా చేశారు



మాట్లాడుతున్న సీమ కృష్ణ

కర్నూలు(అర్బన్), మార్చి 18: నిరుద్యోగులను డీఎస్సీ పేరుతో దగా చేశారని రాయలసీమ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సీమ కృష్ణ ధ్వజమెత్తారు. సోమవారం నగరంలోని విజేత స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగ రాయలసీమ సదస్సులో జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిన విధానాలను ఎండ గడుతూ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ప్రతి జనవరికి క్యాలెండర్ మెగా డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాలకు పేరుతో భ్రమలో నిరుద్యోగులను ఉంచి వారి జీవితాలతో చెలగాటం ఆడారని అన్నారు. సీమకు ప్రత్యేక పబ్లిక్ కమి షన్ ఏర్పాటు చేయాలని, ఆర్టికల్ 37 1 ప్రకారం రాయలసీమలో ఉద్యోగ అవకా శాలు కల్పించాలని, రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూషణ్, గణేష్, షేక్షా, ఉదయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి గోకారమయ్య ఉరుసు



విద్యుత్ దీపాలంకరణలో దర్గా

సి.బెళగల్, మార్చి 18: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో వెలసిన గోకారమయ్య ఉరుసు ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 19న గంధం, 20న ఉరుసు 21న కిస్తీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈసందర్భంగా క్రికెట్, కబడ్డీ, మహిళలకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి చెన్న సోమేశ్వరస్వామి జాతర : మండలంలోని పోలకల్లు గ్రామంలో వెలసిన చెన్నసోమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బాగంగా ఈనెల 19 నుంచి 22వరకు పుష్పరథోత్సవాలను నిర్వహిస్తారు. ఈనెల 23, 24వ తేదీలలో ప్రభోత్సం, రథోత్సవం, తోలుబొమ్మలాట, రాత్రి చలువ కాగులతో యదావుల ఊరేగింపుగా అలయానికి చేరుకుంటారు. ఈనెల 25న పారువేట 26న వసత్సోవం నిర్వహిస్తున్నట్లు అలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైసీపీకి షాక్

- టీడీపీలోకి 32, 36 వార్డుల వైసీపీ నాయకులు
- గౌరు దంపతుల సమక్షంలో 200 కుటుంబాలు చేరిక



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న 32వ వార్డు వైసీపీ నాయకులు

కల్లూరు, మార్చి 18: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో 32, 36 వార్డులకు చెందిన 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం నగరంలోని మాధవీనగర్ గౌరు నివాసంలో 32వ వార్డు ముజఫర్ నగర్, పోలీస్ కాలనీ కల్లూరు ఏస్టేట్‌కు చెందిన బోయగిరి, తలారి కృష్ణనాయుడు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కార్తీక్ కుమార్‌రెడ్డి, వెంకి సాయినాథ్‌రెడ్డి, అశోక్, సాయిసందీప్, రంజిత్‌రెడ్డి, రామాంజనేయలు, సురేంద్ర, బోయ అశోక్, వేణుగోపాల్ రెడ్డి, గిరికృష్ణ, శీను, ఇశాక్ బాషా, ఉపేంద్ర, లోకేష్, భూపాల్‌నాయుడు, శ్రీకాంత్, క్రిష్ణ, వరుణ్ ఉన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి టైలర్ నాగరాజు, ఖాజా బందేనవాజ్, కల్లూరు మండల కన్వీనర్ డి.రామాంజనేయులు, శేఖర్‌చౌదరి, నరేష్ కుమార్‌రెడ్డి, రవిరెడ్డి, కోటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

- 36వ వార్డు వాసవీనగర్‌కు చెందిన 100 కుటుంబాలు వార్డు ఇన్‌చార్జి రెడ్డిగారి చంద్రకళాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి వారికి టీడీపీ కం డువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బి.చిన్న పెద్దయ్య, ఓబులేసు, లక్ష్మన్న, సుబ్బరాయుడు బ్రదర్స్, రాముడు, నిజామ్‌సాహెబ్, హుసేన్ బాషా, వీరన్నగౌడ్, మధుసూదన్, వేణుగోపాల్ ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలన నచ్చక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. కల్లూరు అర్బన్ ఉపాధ్యక్షుడు పెద్దబీచుపల్లి, కురువ ధనుంజయ, చిన్నబీచుపల్లి, సల్కాపురం దేవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు



విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన సి.బెళగల్ వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు గిరిజోన్, తదితరులు

కర్నూలు(రూరల్), మార్చి 18: కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ బామర్ది సి.బెళగల్ మండలం జడ్పీటీసీ సభ్యుడు రంగాపురం గ్రామానికి చెందిన గిరిజోన్ వైసీపీకి గుడ్‌బై చెప్పాడు. సోమవారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమ క్షంలో జడ్పీటీసీ గిరిజోన్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈసందర్భంగా విష్ణువర్ధ న్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కోడుమూరు నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని ఆరోపించారు. జడ్పీటీసీ గిరిజోన్ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసీపీ తనకు పైసా నిధులు ఇవ్వ లేదని, తద్వారా అభివృద్ధి చేయలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పాటు వైసీపీ జిల్లా యూత్ విభాగం నాయకులు తిమ్మందొడ్డి సూరి, ఎంపీయుపీ స్కూల్ చైర్మన్ మధు, మరో వందమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పోలకల్, రంగాపురం టీడీపీ నాయకులు తిమ్మప్ప, శంకర్‌బాబురెడ్డి, మాజీ జడ్పీటీసీలు చంద్రశేఖర్, ఈర్లదిన్నె వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

- కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు శ్రీరాములు, మద్దిలేటి, మధు, గిరి, మోహన్, మహేష్, సురేష్, రాముడు, ప్రసాద్, గిడ్డయ్య, తోపాటు మరో 30మంది టీడీపీలో చేరారు.
- కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామ టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, ఆమె భర్త నారాయణలు విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి సత్క రించారు. బొగ్గుల దస్తగిరి గెలుపునకు కృషి చేస్తామని వారు వివరించారు.

'అశోకా'లో ముగిసిన ఈ-క్యూబ్ కార్నివాల్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న టీజీ భరత్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18: స్థానిక దూపాడు సమీపంలో ఉన్న అశోకా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అశోకా ఈ-క్యూబా కార్నివాల్ సోమవారం ముగిసింది. ఈకార్యక్రమానికి టీజీ భరత్ హాజరై మాట్లాడుతూ అశోకా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న అచీవ్‌మెంట్స్, ఉద్యోగ నియామకాలు అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఎంటర్టైన్‌మెంట్, ఎంపోవర్‌మెంట్ అందించే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. కళాశాల సీఈవో డా.హరీష్ కృష్ణ మాట్లాడుతూ అబ్బాయిలతోపాటు అమ్మాయిలు కూడా పోటీల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్, డీజే, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు టీజీ భరత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



ఆర్.కొంతలపాడులో పర్యటిస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), మార్చి 18: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం ఆర్.కొంతలపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచు మహానంది, కురువ గిడ్డయ్య, ఉపసర్పంచు బోయగిడ్డయ్య, చిన్నగి డ్డయ్య, మాజీ సర్పంచు గొల్లసాయికృష్ణ, మునిరెడ్డి, లోకారెడ్డి, రామాంజనే యులు, మద్దిలేటి, నాగరాజు, గిరి, జనసేనా నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన గోదా గోకులం వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

కర్నూలు(కల్చరల్), మార్చి 18: నగర శివారు మామిదాలపాడులోగల గోదా రంగనాథస్వామి వారి దేవస్థానం (గోదాగోకులం)లో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. చివరి రోజున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, పలు సేవలు నిర్వహించారు. ఉదయం వేకువ జామును ప్రాతఃఆరాధన, అర్చనలు, సేవా కాలం, ధ్వజ కుంభారాధన, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారా యణం చేశారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీ, త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీ, ప్రయాగరాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామీల నేతృత్వంలో, శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేశ్ భట్టార్, కిరణ్ భట్టార్‌లు అష్టోత్తర శత కలశ ఉత్సవాన్త స్నపన కార్యక్ర మాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. 108 రజత కలశాలతో తిరుమంజనం కార్యక్రమాన్ని స్వామి అమ్మవార్లకు నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి చేపట్టారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్ధన్, తల్లం సురేష్ పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

కర్నూలు, మార్చి 18: ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీ సులు సోమవారం కవాతు నిర్వహించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, ఆదోని సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలైన 'సశస్త్ర సీమా బల్' సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహిం చారు. నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పందిపాడు, ఇందిరమ్మ కట్ట, ఓల్డ్ కల్లూరులో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు మోహన్ కిషోర్, సునీల్, పోలీసులు పాల్గొన్నారు. అలాగే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పూలబజారు, బండి మెట్ట, ఛత్రిబాగ్, గనిగల్లి, పెద్దరంగరాజువీధి, చిత్తారివీధి, రాంబోట్ల దేవాలయం, గడ్డాస్ట్రీట్, జమ్మిచెట్టు, కబేళా, పెద్దపడఖానా ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ పవన్ కుమార్, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ్డ కర్ణాటక మద్యం

కోడుమూరు, మార్చి 18: కోడుమూరులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు సీఐ రామాంజనేయులు, కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు పట్టుకొన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సోమవారం సెబ్ పోలీసులకు సమాచారం వచ్చింది. ఇందులో బాగంగా మండలంలోని వెంకటగిరి గ్రామం వైపు ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో సెబ్ సీఐ రామాజనేయులు తనిఖీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న స్కార్పియో వాహనాన్ని గుర్తించారు. అలాగే స్కార్పియో వాహనంతోపాటు ఒక మోటర్ సైకిల్ పట్టుకొనే ప్రయత్నం చేశారు. మోటర్ సైకిల్ అక్కడి నుంచి తప్పించుకొన్నాడు. సెబ్ సీఐ కోడు మూరు ఎస్ఐ బాల నరసింహులుకు సమాచారం అందించాడు. వెంటనే స్పం దించిన ఎస్ఐ మోటర్ సైకిల్‌ను వెంబడించి పట్టుకున్నారు. ఎరుకలచెర్వు గ్రామానికి చెందిన ఎరుకల మహేంద్ర, మాచాపురం గ్రామానికి చెందిన మునిస్వామి అనే ఇద్దరు నింది తులను అరెస్టు చేసి స్కారియో వాహనం, మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సెబ్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంటు సూపరిం టెండెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కర్ణాటక మద్యాన్ని కోడుమూరు మీదుగా క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి తరలించే ప్రయత్నం నింది తులు చేశారని అన్నారు. ఈ దాడిలో ఒరిజినల్ ఛాయిస్ 81 బాక్సులు అలాగే 7776 టెట్రా ప్యాకెట్లు పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.4,90,000 ఉంటుందన్నారు. ఈ అక్రమ మద్యం తరలింపు వెనక మరో ఐదుగురు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన గడ్డం నాయుడు, క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన బోయకిట్టు, ఎరుకల చెరువు గ్రామానికి చెందిన ఎరుకల వెంకటేష్, శ్రీను, అలాగే అగవేలి గ్రామానికి చెందిన కృష్ణలు ఉన్నారని తెలిపారు. వాళ్లను కూడా త్వరలో పట్టుకొంటామని తెలిపారు. ఈ సమావేశంలో కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఎంపీడీవో శకుంతల

సి.బెళగల్, మార్చి 18: మండలంలోని గ్రామ పంచాయతీల్లో వైసీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలను మండలస్థాయి అధికారులు సోమవారం తొలగించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ కార్యాల యాలు, పబ్లిక్ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని గ్రామ కార్యదర్శులకు, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ అనుపమ, ఈవోఆర్డీ సందీప్ ఉన్నారు.

తాగునీటి కుంట పరిశీలన

సి.బెళగల్, మార్చి 18: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలోని తాగునీటి కుంటను టీడీపీ నాయకులు శరత్, మోహన్ సోమవారం పరిశీలించారు. ఈ కుంటకు తాగునీరు విడుదల చేయాలని గ్రామస్థులు, టీడీపీ నాయకులు గత వారంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కుంటకు తాగునీరు విడుదల చేశారు.

ఎన్నికల సమరానికి సిద్ధం కండి: డీసీసీ

కర్నూలు(అర్బన్), మార్చి 18: సార్వత్రిక ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిందని, రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ సీట్లు, 25 ఎంపీ సీట్లకు రాష్ట్ర వాప్తంగా 1,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దేశ ప్రజల భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, విశ్రాంత ఐఏఎస్ అధికారి రామస్వామి, కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, పీసీసీ అధికార ప్రతినిధి దామోదరం రాధాకృష్ణ, బి.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు బతుకన్న, పాల్గొన్నారు.

సామాన్యులకు వైద్యం అందుబాటులోకి రావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), మార్చి 18: సామాన్యులకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ వైద్యుడు, జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'మీరే వైద్యం చేసుకోవచ్చు' అన్న పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. ఈ సభకు విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు అధ్యక్షత వహించగా, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కరోనా వైరస్ సమాజాన్ని తీవ్రంగా నష్టపోయేలా చేసిందని అన్నారు. కరోనా తర్వాత నేడు అనేక వ్యాధులు వస్తున్నాయని, చీటికి మాటికి వైద్యుల దగ్గరికి పరుగెత్త కుండా ఇంటిలోనే వైద్యం చేసుకోవడానికి వీలుగా ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ పుస్తకం అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు మహ్మద్ మియా, స్వరాజ్యలక్ష్మి, శ్రీరాములు, సాహితీ స్రవం తి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పాల్గొని ప్రసంగించారు.

తాగునీరు అందించాలి

కోడుమూరు(రూరల్), మార్చి 18: మండలంలోని గోరంట్ల గ్రామంలో తాగునీరు అందించాలని మహిళలు సచివాలయాన్ని ముట్టడించారు. స్థానిక అనుగొండ రహదారిలోని బీసీ కాలనీవాసులు తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. చివరి కాలనీలకు తాగునీరు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. సమస్య పరిష్కరించాలని సచివాలయంలో భైఠాయించారు. విషయం తెలిసిన ఎస్ఐ బాలనరసింహులు చేరుకుని మహిళలను సముదాయించారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికా రులకు సూచించారు. తాగునీటి పైప్ లైన్‌లో అక్రమ కొళాయి కనె క్షన్‌లను తొల గించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

పది పరీక్షలు ప్రారంభం

ఓర్వకల్లు, మార్చి 18: మండల కేంద్రమైన ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, బాలభారతి, కాల్వబుగ్గ ఏపీఆర్, లొద్దిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాం తంగా ప్రారంబమయ్యాయి. ఉదయాన్నే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ తహసీల్దార్ నటరాజ్ ఆధ్వర్యంలో అమలు చేశారు. ఆయా కేంద్రాలను ఎస్ఐ రాజారెడ్డి తనిఖీ చేశారు.

కోడుమూరు(రూరల్): మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటిరోజున పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు హాల్ టికెట్ నంబరు, పరీక్షా గది పరిశీలనలో మునిగిపోయారు. కోడుమూరు బాలుర ఉన్నత పాఠశాల కేంద్రం గేటు వెలుపల విద్యార్థులందరూ గుమికూ డడంతో సందడి ఏర్పడింది. లోపలికి అనుమ తించిన సమయంలో గదులకు చేరుకు న్నారు. కాగా బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో ఐదుగురు, బాలికల ఉన్నత పాఠశాల ఏ కేంద్రంలో 4, బీ కేంద్రంలో 2, మోడల్ స్కూల్ కేంద్రంలో 7, లద్దగిరి కేంద్రంలో 9, గోరంట్ల గురుకుల పాఠశాల కేంద్రంలో ఐదుగురు తొలిరోజు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారులు వెల్లడించారు.

సి.బెళగల్: మండలంలోని పదో తరగతి పరీక్షల కేంద్రాల వద్ద ఎస్ఐ తిమ్మారెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి పది పరీక్షల కేంద్రాల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎంఈవో ఆదాంబాషా మాట్లాడుతూ 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

గూడూరు: గూడూరు పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాల సెంటర్‌లో 300 మంది విద్యార్థులు, జడ్పీ బాలురు పాఠశాల ఏ సెంటర్‌లో 210 మంది, జడ్పీ బాలురు పాఠశాల బి సెంటర్‌లో 200 మంది విద్యార్థులు, ఇందులో రెగ్యులర్ 576 మంది విద్యార్థులు కాగా, ప్రైవేటు విద్యార్థులు 134 మంది ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ తెలిపారు.



ఓర్వకల్లులో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గ్రోమోర్ కేంద్రంలో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో రవిప్రకాష్

కోడుమూరు, మార్చి 18: స్థానిక గ్రోమోర్ కేంద్రాన్ని వ్యవసాయ అధికారి రవిప్రకాశ్ సోమవారం తనిఖీ చేశారు. గోదాములోని స్టాక్‌ను ఆయన పరిశీలించారు. ఇందులో రసాయనిక ఎరువులను పరిశీలించిన ఆయన నాలుగు రకాల రసాయనక ఎరువులను ప్రమాణాలను సేకరించారు. సేకరించిన ప్రమా ణాలను పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం, తిరుపతి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైన అనుమతి లేని ఎరువులును విక్రస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమాదేవి



ప్రిన్సిపాల్ రమాదేవి

ఆలూరు, మార్చి 18 : ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమాదేవి నియామకం అయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. జూనియర్ లెక్చరర్‌గా ఉన్న రమాదేవి పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా నియామకం అయ్యారు.

ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ సీతారామయ్య



ఎన్నికల తీరుపై మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల కోడ్ నిబంధనలలో అప్రమత్తంగా ఉండాలని, ఏ నాయకులకు గానీ, పార్టీలకు గానీ వత్తాసు పలకకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. సోమవారం రాత్రి రాగసుధ సమావేశ మందిరంలో మంత్రాలయం నియోజకవర్గంలోని ఎన్నికల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి సీఐ ఎరిషావలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పోలింగ్ విధులక ఆటంకం కలిగించే వ్యక్తులను గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను దృష్టిలో ఉంచుకుని ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పట్ల రూట్లు, రోడ్లు, పోలింగ్ అధికారులు పాల్గొనేవారికి తగిన భద్రతలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు గోపినాథ్, క్రిష్ణమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఆదోని రూరల్, మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలో కోడ్ అమలులో ఉందని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎఆర్ఓ, తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అర్బన్, రూరల్ పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టి), మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు (ఎంసిసి) టీంలు ఏర్పాటు చేశామని, వీరు నిరంతరం ఎన్నికల ఆదేశాలు ఉల్లంఘనపై నిఘా ఉంచి అధికారులకు సమాచారం అందిస్తారని పేర్కొన్నారు. రాజకీయ నాయకులతోప్రభుత్వ అధికారులు, వలంటీర్లు, రాజకీయపరంగా కలిసి ప్రచారాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

అపుస్మ ఆలూరు యూనిట్ అధ్యక్షుడిగా విజయరాజ్

ఆలూరు, మార్చి 18 : ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అన్ ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆలూరు యూనిట్ అధ్యక్షుడిగా విజయరాజ్, కార్యదర్శిగా కాబూల్ సాబ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఆయనను స్థానిక లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా నాయకులు రాజేంద్ర రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘునాథ్, గౌరవ సలహాదారు గురునాథ్, ప్రగతి సన్మానించారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, మార్చి 18 : వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు.. పాల్గుణ నవమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు.

32 బాక్సుల కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యంతో సీఐ, ఎస్ఐ

నందవరం, మార్చి 18: నందవరం మండలంలో భారీగా కర్ణాటక మద్యంను ఎమ్మిగనూరు తాలుకా సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ తిమ్మయ్య సోమవారం రాత్రి పట్టుకున్నారు. వివరాలు మండల పరిధిలోని నాగలదిన్నె, నదికైరవాడి దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండంగా పోలీసులు భారీగా కర్ణాటక మద్యంను పట్టుకున్నారు. బెలగల్ మండలం తిమ్మన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ క్యాతురు వీరేష్, లక్ష్మన్నలు కర్ణాటక జిల్లాకు చెందిన తలమారి గ్రామానికి చెందిన వీరేష్ దగ్గర మద్యం కొనుగోలు చేసి తీసుకుని వస్తుండగా రెండు మోటర్ బైకులను, మద్యంను స్వాధీనం చేసుకున్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

తుగ్గలి, మార్చి 18: పత్తికొండలో జరిగే పశువుల సంతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలయ్యాయి. సోమవారం మండల పరిధిలోని రాతన ఆశ్రమ పాఠశాల సమీపంలో గుంతకల్లు మండలం ములకలపెంట గ్రామానికి చెందిన రైతులు పత్తికొండలో జరిగే గొర్రెల సంతకు వచ్చి గొర్రెలను తీసుకుని వెళ్తుండగా.. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రంగనాయకులు, ఆంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పత్తికొండ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యచికిత్సల కోసం కర్నూలుకు తరలించారు. మిగిలిన ఐదు మందికి స్వల్పగాయాలయ్యాయి. పెద్ద పెద్దన్న పిర్యాదు మేరకు తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

టీడీపీ విజయం తథ్యం

మద్దికెర, మార్చి 18: అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు రాము యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయం తథ్యమన్నారు. చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ హాజరైన జనసందోహాన్ని చూస్తుంటే. మరో రెండు నెలల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త టీడీపీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాకలి రాము, వడ్డె రాజేష్, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

దేవనకొండ, మార్చి 18 : ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే కఠినచర్యలు తప్పవని అనుమానితులను సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మండలంలోని కరివేములలో పర్యటించారు. గ్రామాలలోని అనుమనితులపై నిఘా వేశామని అసాంఘిక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

డివిజన్‌లో 499 మంది విద్యార్థులు గైర్హాజరు



ఆదోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 18 : ఆదోని డివిజన్‌లో మొదటి రోజు పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9.30 నుంచి 12.45 వరకు లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాలలో అరగంట ముందే విద్యార్థులను అనుమతించారు. లోపలకు వెళ్లేటప్పుడు పకడ్బందీగా విద్యార్థులను పోలీసులు తనిఖీ చేసి లోపలికి పంపారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, ఇతర వస్తువులను అనుమంతిచలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న తాగునీటి బాటిల్స్ సైతం బయటే ఉంచారు. డివిజన్‌లోని 84 పరీక్షా కేంద్రాలలో 16745 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 499 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సౌకర్యం కల్పించామన్నారు.

మంత్రాలయం : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం, మాధవరం నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల్లో మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. ఈ నాలుగు కేంద్రాల్లో 785 మంది విద్యార్థులకు గానూ 760 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 25 మంది గైర్హాజరయ్యారు.

ఆలూరు : మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1,2, మోడల్ స్కూల్, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాల్లో 993 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో కోమలాదేవి తెలిపారు.

ఎమ్మిగనూరు : పట్టణంలో మొత్తం 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఉన్నతపాఠశాలల విద్యార్థులు 3,219మంది ఆయా కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యారు.

పత్తికొండ : మండల కేంద్రంలో బాలుర హై స్కూల్, బాలికల గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ పాఠశాలలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈవో రమేష్ తెలిపారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో 1,126 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. మొదటి రోజు 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.







గోనెగండ్లలో టేబుల్స్ లేక నేలపై కూర్చొని పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, దివ్యాంగుడిని పరీక్ష కేంద్రాని తీసుకెళ్తున్న దృశ్యం, పరీక్షలు రాసేందుకు ఆటోలో ప్రయాణం

బస్సు సౌకర్యాలేవీ...?



పరీక్షలు రాసి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

మద్దికెర, మార్చి 18: పదవ తరగతి పరీక్షల రాసే విద్యార్థులకు బస్సు సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయించి పరీక్షలు రాస్తున్నారు. మండలంలోని ఎం.అగ్రహారం, ఎడవలి, బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మద్దికెర పరీక్ష కేంద్రానికి వస్తారు. సోమవారం మద్దికెరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సులు లేక ఆటోల్లోనే ప్రయాణాలు చేస్తున్నారు. పరీక్షలు రాయడానికి ఆలస్యం అవుతుందనే ఉద్దేశంతో విద్యార్థులు అదనపు ఖర్చులు భరిస్తూ ఆటోలను మాట్లాడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సులు లేకపోవడం చాలా బాధాకరమని విద్యార్థులు చెబుతున్నారు.

టీడీపీ టికెట్ నాకే వస్తుంది

● మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి

● టీడీపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 18: నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ టికెట్ తనకే వస్తుందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుల వారం రోజుల సర్వేలో తనకే వస్తుందని అధిష్టానం మార్పులు చేస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి తెలిపారు. సోమవారం మంత్రాలయంలో నూతనంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాన్ని టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, పూజారి వ్యాసరాజాచార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయానికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం టీడీపీ టికెట్‌ను రెండో విడతలో వైసీపీ కోవర్టుకు ఇవ్వడం సరికాదని, వారం రోజులుగా టీడీపీ అధిష్ఠానం నిఘా ఉంచి సర్వేల ఆధారంగా జరుగుతున్న సర్వేలను నిశితంగా పరిశీలిస్తున్నారని, త్వరలో మార్పులు జరిగి తనకే టికెట్ ప్రకటిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తలు అధైర్యపడవద్దని, ఎన్నికల బరిలో తాను పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. మండల స్థాయి, గ్రామ స్థాయి లీడర్లంతా ఎన్నికలపై దృష్టి సారించి వైసీపీకి వ్యతిరేకంగా ప్రజలను దృష్టి సారించాలన్నారు. సమావేశంలో రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, బూదురు మల్లికార్జున రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ఎస్వీ భాస్కర్ రెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, అశోక్ రెడ్డి, అబ్దుల్లా, గోపాల్, జెట్టి వీరేష్, మాలపల్లి చంద్ర పాల్గొన్నారు.

గ్రామాల వారీగా అభ్యర్థి ఎంపికపై తీర్మానం : మంత్రాలయం నియోజకవర్గంలో రెండో జాబితాలో టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమైందని, గ్రామాల వారిగా అభ్యర్థి మార్పుపై తీర్మానాలు చేస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి తెలిపారు.

29 నుంచి మహా సమారాధనోత్సవాలు



మాట్లాడుతున్న మఠం ఏఏవో మాధవశెట్టి

మంత్రాలయం, మార్చి 18: రాఘవేంద్రస్వామి పూర్వపు పీఠాధిపతులు సుయధీంద్రతీర్థుల మహాసమారాధనోత్సవాలు ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు పీఠం ఇచ్చిన గురువు నవమంత్రాలయ నిర్మాణకర్త సుయతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు 29న పూర్వారాధన, 30న మధ్యారాధన, 31న ఉత్తరాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో యాగశాలలో శ్రీమఠం ప్రాకారంలో ఉన్న యాగశాలలో ప్రత్యేక వేదికపై విద్య, వైద్య, సాంకేతిక, న్యాయ, రాజకీయ, సామాజిక సేవల్లో విశిష్ట సేవలందించిన వారి సేవలను గుర్తిస్తూ సుయతీంద్రతీర్థుల 2024 అవార్డులను ఎంపిక చేసి సన్మానిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజులు దాసవానిసాహిత్యం, ఆధ్యాత్మిక భక్తిగీతాలు, వీణావాయిద్యం, పండితుల ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు రోజులు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతి, తాగునీరు పరిశుభ్రత భోజన సదుపాయం, దర్శన క్యూలైన్లు, పరిమళ ప్రసాదం, ఆయా శాఖల అధికారులతో ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల చేతుల మీదుగా తన గురువులైన సుయతీంద్రతీర్థుల బృందావనానికి విశేష పూజలు, అలంకరణాలు, అభిషేకాలు చేసి భక్తులను ఆశీర్వదించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాఘవేంద్రస్వామి, సుయధీంద్రతీర్థుల ఆశిస్సులకు పాత్రులు కావాలని కోరారు.

కోడ్ కూసినా మేల్కోరా..?

ఆదోని రూరల్, మార్చి 18 : గత శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచే దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రజలు, ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా ఉండాలని, రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫొటోలు తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. కానీ ఆదోని అధికారులకు మాత్రం ఇవేవీ చెవికెక్కినట్లు లేదు. సోమవారం సాయంత్రానికి పట్టణం, రూరల్ పరిధిలో ఎటూ చూసినా సీఎం జగన్‌కు సంబంధించిన బ్యానర్లు తారస పడుతున్నాయి. ఆదోని నడీబొడ్డున నిర్మల్ టాకీస్ సమీపంలో వైసీపీ రంగులతో వార్డు సచివాలయం ఇంకా దర్శనమిస్తూనే ఉంది. పెద్దతుంబళం పీహెచ్‌సీకి సంబంధించిన ప్రభుత్వ ఆరోగ్య తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు రాజశేఖర్ రెడ్డి, జగన్ బొమ్మలు అలానే ఉన్నాయి. అలసందగుత్తి గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. చాలా గ్రామాల్లో వైసీపీ రంగులతో ఏర్పాటు చేసిన రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు అలాగే కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిద్ర మేల్కొని వైసీపీ బ్యానర్లను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు వీటిపై దృష్టి సారించి తొలగించకుండా ఎంపీడీఓ, తహసీల్దార్, మున్సిపల్, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సమావేశాలకే పరిమితమయ్యారు. అధికారుల తీరు చూస్తుంటే వైసీపీ నాయకులకు భయపడి వారు ఉద్యోగ ధర్మాన్ని కాలరాస్తున్నట్టు ఉంది.

హెచ్ కైరవాడి కేడీసీసీ బ్యాంక్ అటెండర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

గోనెగండ్ల : హెచ్ కైరవాడి కేడీసీసీ బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న జీ హనుమంతు ఆదివారం సాయంత్రం పెద్దనేలటూరులో వైసీపీ చేపట్టిన 'నేను సిద్ధం.. నా వార్డు సిద్ధం' అనే కార్యక్రమంలో పాల్గొన్నారని సోమవారం కలెక్టర్‌కు రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్నికల ప్రచారం లో పాల్గొనకూడదన్న విషయం విదితమే.

పశు సంచార అంబులెన్స్‌కు సీఎం ఫొటో

ఆలూరు : దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ అమలులోకి వచ్చింది. 24 గంటల్లో ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని ఆదేశించి 48 గంటలు పూర్తి అయినా, సోమవారం ఆలూరు పట్టణంలో పశు సంచార అంబులెన్స్‌కు సీఎం జగన్మోహన్ రెడ్డి ఫొటో మాత్రం తొలగించలేదు.

వెల్దుర్తి : ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి రెండురోజులైనా పట్టణంలో ఫ్లెక్సీలు ఇంకా తొలగించలేదు. పట్టణంలో ఆర్‌కె రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న సుజల స్రవంతి మంచినీరు సరఫరా కేంద్రం, సంత బజార్ నీళ్ల ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన శిలా ఫలకం రాజకీయ ముఖచిత్రాలు ఇంకా తొలగలేదు.



ఆదోని నిలో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు జగన్, వైఎస్ ఫొటోలు



ఆదోనిలో వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న వార్డు సచివాలయం

హోరాహోరీగా సెపక్ తక్రా పోటీలు

● రెండో రోజు ఆర్‌యూ జట్టు విజయం



గెలుపొందిన రాయలసీమ యూనివర్సిటీ జట్టుతో నిర్వాహకులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 18 : రాయలసీమ విశ్వవిద్యాలయం, ఆదోని ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్‌తక్రా పోటీలు సోమవారం రెండవ రోజు పలు జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ముందుగా క్రీడాకారులను రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ బీ సుధీర్ ప్రేమ్‌కుమార్, మాజీ కరస్పాండెంట్ విశ్వనాథ్ రెడ్డి, క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవరచుకోవచ్చని సూచించారు. గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. అబ్దుల్ కలాం విశ్వవిద్యాలయం జట్టుపై ఎంజేపీఆర్ బరేలీ విశ్వవిద్యాలయం విజయం సాధించగా, రెండవ మ్యాచ్ శ్రీకుషల్‌దాస్ విశ్వవిద్యాలయ జట్టు పై చెన్నై అన్న విశ్వవిద్యాలయం విజయం సాధించింది. మూడవ మ్యాచ్ మాధవ్ యూనివర్సిటీ జట్టుపై హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. నాలుగవ మ్యాచ్ గొంతావాన్ యూనివర్సిటీ జట్టు పై కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కరస్పాండెంట్లు తిమ్మారెడ్డి, బసవన్న గౌడ్, సత్యనారాయణ రెడ్డి, సనత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, ఆర్‌యూ రెక్టార్ నాయక్, రిజిస్టర్ అంకన్న, శివకిషోర్, ముత్తయ్య, కళ్యాణ్‌కుమార్, చంద్రశేఖర్, కాంటీరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీకే ఆదోని టికెట్ ఇవ్వాలి

ఆదోని టౌన్, మార్చి 18 : ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం ఆదోని సీటును టీడీపీకి కేటాయించాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నూర్ అహమ్మద్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా ఆదోని సీటును బీజేపీకి కేటాయించడాన్ని నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వెల్లిబుచ్చారు. ఈ విషయంలో బీజేపీను తప్పుపట్టడం లేదని, రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన అధికారపక్ష అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలన్న ప్రజల ఆకాంక్షలను తీర్చడం కోసం టీడీపీకి కంచుకోట లాంటి ఆదోని సీటును టీడీపీకే వదిలేయడం ఎంతో అవసరమని అన్నారు. లేనిపక్షంలో స్థానిక అధికారపక్ష పార్టీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలిచే ప్రమాదముందని అన్నారు. ఆదని అసెంబ్లీలో టీడీపీ విజయం సాధిస్తుందని అనేక సర్వే రిపోర్టులు సూచించడం గమనించి, ఆదోని అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని బీజేపీ నాయకులు కూడా సీటు కేటాయింపు పై పునరాలోచించాలని కోరారు.

జగన్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం : కేఈ

పత్తికొండ, మార్చి 18: సీఎం జగన్ రెడ్డిని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజాగళమే విజయవంతమే అందుకు నిదర్శనమని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజాగళంకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చి విజయవంతం చేశారన్నారు. జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైందని, వైసీపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని పైకి మాత్రం ఒకరిపై ఒకరు దూషణలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆలూరు, మార్చి 18 : మండలంలోని మొలగవల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 8,190 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఓబులేసు సోమవారం రాత్రి తెలిపారు. పట్టుబడిన వారిలో నగరడోన గ్రామానికి చెందిన గోపాల్, రాముడు, మల్లికార్జున, శ్రీరామ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆలూరు, మార్చి 18 : ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి ఆలూరు ఎస్ఐ ఓబులేసు అధ్వర్యంలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలను ప్రత్యేకంగా సోదాలు నిర్వహించారు. ఆలూరు పట్టణంలో బైక్ రైడ్‌లు నిర్వహిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ నాయకుడు శ్రీకాంత్ మృతి

ఎమ్మిగనూరు, 18: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు యు శ్రీకాంత్(52) సోమవారం మృతిచెందాడు. శ్రీకాంత్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ వస్తున్నాడు. శ్రీకాంత్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

మద్దికెర, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉందని రాజకీయ పార్టీల నాయకులందరూ తూచా తప్పకుండా ఎన్నికల నియమావళిని పాటించాలని ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ఫ్లెక్సీలు తొలగించలేదు అనే వార్తకు స్పందించిన ఎంపీడీవో అలివేలమ్మ వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను హోర్డింగులను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అమలు చేసిన విధివిధానాలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. ఎవరైనా, ఏ రాజకీయ పార్టీలైనా, నాయకులైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలిగించామని పేర్కొన్నారు.